# వరిలో ఆకు ఎండుతెగులు

- మొన్నటి వరకు ఎడతెరిపి లేకుండా వర్షాలు, ఇప్పుడు అధిక ఉష్ణోగ్రతలు
- నివారణ చర్యలతో దిగుబడులు



వెంగ్వాపేట్‌లో రైతు సాగు చేసిన వరి పంటకు తెగుళ్లు

సోన్, అక్టోబర్ 10 : వానకాలంలో సాగు చేసిన వరి పంట మొన్నటి వరకు మురిపించింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రస్తుతం ఎండలు దంచికొడుతుండడంతో వాతావరణంలో మార్పులతో వరి రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. యూరియాను అధిక మోతాదులో వాడడంతో దీనికి కారణమంటున్నారు వ్యవసాయశాఖ అధికారులు. సెప్టెంబర్– అక్టోబర్ నెలలో మబ్బులతో కూడిన వాతావరణం, రెండు, మూడు రోజులు ఎడతెరిపి లేకుండా కురిసే వర్షాలు, తక్కువ ఉష్ణోగ్రతలు, తదితర పరిస్థితులు వరిలో ఆకు ఎండుతెగులు ఆశించడానికి దోహదం చేస్తాయి. నారు మడి దశ నుంచి గింజ పాలు పోసుకునే వరకు తెగులు ఆశించే అవకాశం ఉండడం, చెట్టు నీడ పడే ప్రదేశంలో ఎక్కువగా ఆకుఎండు తెగులు ఆశించి మిగిలిన పంటకు వేగంగా వ్యాప్తిస్తోంది. నిర్మల్, సోన్ మండలంలోని వెంగ్వాపేట్, లంగ్డాపూర్, చిట్యాల్, డ్యాంగాపూర్, నీలాయిపేట్, మేడిపెల్లి, సోన్, న్యూవెల్మల్ బొప్పారం, సిద్దులకుంట, పాక్‌పట్ల, కూచన్‌పెల్లి, కడ్తాల్, సాకెర గ్రామాల్లోని రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. అయితే ఈ వానకాలంలో ఎక్కువగా సన్నరకం వంగడాలను సాగు చేయడం వల్ల ఈ రకానికి ఎక్కువగా తెగుళ్లు వచ్చే అవకాశం ఉంది. రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే దిగుబడులు సాధించుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

### తెగులుకు గుర్తించే విధానం....

వరి పంటలో ఆకుఎండు తెగులు సోకిన ప్రదేశంలో ముందుగా ముదురు ఆకులకు పసుపు రంగు మచ్చలు ఏర్పడి పైనుంచి కింది అంచుల వెంబడి వ్యాపించి ఎండుతూ వస్తాయి. ఉదయం సమయంలో గమనిస్తే ఆకుల మీద పసుపు రంగు జిగురు ముద్దలు కనబడతాయి. ఎండ వేడిమికి గట్టిపడి రాలిపోతాయి. ఈ ఎండిన బ్యాక్టీరియా ముద్దలు నీటి ద్వారా వెళ్లి మిగిలిన పంటకు వ్యాప్తిస్తోంది.

### నివారణ చర్యలు....

బ్యాక్టీరియా వ్యాప్తి నివారణకు తెగులు సోకిన మొక్కల నుంచి ఆరోగ్యకరమైన పంటకు నీరు పారకుండా చూసుకోవాలి. తెగులు ఆశించిన పొలంలో యూరియాను వేయకూడదు. కాపర్ ఆక్సిక్లోరైడ్ 30 గ్రాములు, ప్లాంటోమైసిన్ 4 గ్రాములు, లేదా పోషామైసిన్ లేదా స్ప్రెప్లోసైక్లిన్ నాలుగు గ్రాములు పది లీటర్ల నీటిలో కలిపి 2–3సార్లు వారం వ్యవధిలో పిచికారీ చేయాలి.

# కేసు నమోదు

కుంటాల, అక్టోబర్ 10 : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత మొదటి సారి పోలీసులు మండలంలోని పలు దాబా రెస్టారెంట్, హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. సోమవారం రాత్రి ఓలా, కుంటాలలోని దాబా రెస్టారెంట్‌లో 11,640 రూపాయల విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని సీజ్ చేసి బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హన్మండ్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై తగు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

# అభివృద్ధి పథంలో 'పిప్పల్‌ధరి'

- రూ. 35 లక్షలతో పనులు
- సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు

బోథ్, అక్టోబర్ 10 : బోథ్ మండలంలోని పిప్పల్‌ధరి గ్రామం అభివృద్ధి పథంలో పయనిస్తున్నది. గ్రామ పంచాయతీగా ఏర్పాటు కావడంతో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తున్నది. గ్రామంలో 160 కుటుంబాలకు గాను 449 మంది జనాభా ఉన్నారు. కుచులాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో అనుబంధ గ్రామంగా ఉన్నప్పుడు అభివృద్ధి పనుల నిధుల కోసం ఏళ్ల తరబడి వేచి చూసే పరిస్థితి ఉండేది. కొత్త పంచాయతీగా ఏర్పాటు కావడంతో ప్రతి ఏటా నిధులు వస్తుండడంతో కావాల్సిన పనులు చేస్తున్నారు. సుమారు రూ.33.80 లక్షల నిధులతో గ్రామంలో పనులు చేపట్టారు. ప్రధాన రోడ్డుతో పాటు కొత్త కాలనీల్లో రూ.10 లక్షలతో మూడు వందల మీటర్ల పొడవు పాటు సీసీ రోడ్డు నిర్మించారు. రూ 2 లక్షలతో వంద మీటర్ల డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. రూ 12 లక్షలతో శ్మశాన వాటిక, రూ 30 వేలతో క్రీడాప్రాంగణం, రూ.7 లక్షలతో పాఠశాలలో తరగతి గది, రూ 2.50 లక్షలతో డంప్ యార్డు నిర్మించారు. అవెన్యూ ప్లాంటేషన్ కింద రోడ్డుకు ఇరువైపులా 800 వివిధ రకాల మొక్కలు నాటారు. ఇప్పుడు అవి చెట్లుగా పెరిగి గ్రామానికి స్వాగతతోరణంగా కనిపిస్తున్నాయి. గ్రామంలో పనులు వేగంగా జరగడంతో పిప్పిల్‌ధరి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పిప్పల్‌ధరి గ్రామం

### గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం...



గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం. వస్తున్న నిధులతో అవసరమైన చోట పనులు చేపడుతున్నాం. పంచాయతీ భవనం లేక పోవడంతో కొంత ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం భవనం కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతున్నాం.

-బీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్, పిప్పల్‌ధరి



కొత్త కాలనీలో నిర్మించిన సీసీరోడ్డు



రోడ్డు వెంబడి ఏపుగా పెరిగిన చెట్లు

### కాలనీలో రోడ్డు లేక ఇబ్బంది పడేవాళ్లం...



మా కొత్త కాలనీలో రోడ్డు లేక ఇబ్బంది పడేవాళ్లం. రోడ్డంతా మట్టి, బురదలో నడుచుకుంటూ ఇళ్లలోకి వెళ్లే వాళ్లం. వానకాలంలో మా పరిస్థితి మరి దారుణంగా ఉండేది. ఇప్పుడుగా పరిస్థితి మొత్తం మారిపోయింది. కాలనీలో సీసీ రోడ్డు వేయడంతో ఇబ్బంది లేకుండా పోయింది.

- గట్టు నర్సమ్మ, గ్రామస్తురాలు

### మురుగునీరు రోడ్లపైకి వచ్చేవి...



మురుగుకాల్వలు లేక నీరు రోడ్లపైకి వచ్చేవి. వానకాలంలో దుర్గందం వచ్చేది. దోమలతో రోగాలు వచ్చేవి. ఇప్పుడు ఆ ఇబ్బంది లేకుండా పోయింది. రోడ్లు వేసి పక్కన డ్రైనేజీలు నిర్మించారు. నీళ్లు ఆగకుండా వెళ్లి పోతున్నాయి. కొత్తగా పంచాయతీగా మా ఊరే మారిపోయింది.

- మూటపెల్లి గంగామణి, గ్రామస్తురాలు

# ప్రణాళిక ప్రకారంగా ఎన్నికల ప్రచారం నిర్వహించాలి

- పీఏసీఎస్ చైర్మన్ మారుతిపటేల్ డోంగ్రే
- బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం

ఇంద్రవెల్లి, అక్టోబర్ 10: ఎన్నికల ప్రచారానికి ప్రణాళిక ప్రకారం గ్రామాలకు వెళ్లాలని, ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నింబంధనలు పాటించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ మారుతిపటేల్‌డోంగ్రే అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ముఖ్య నాయకులు, గ్రామాల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కలిసి కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రజా కార్యక్రమాలు, గ్రామాల్లో చేపట్టి అభివృద్ధి పనులు ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపీపీ కనక తుకారాం, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అబ్దుల్ అమ్జద్, బీఆర్ఎస్ మండల కోఆర్డినేటర్ షేక్ సుఫియాన్, ఉపాధ్యక్షుడు రాందాస్, ప్రధానకార్యదర్శి కనక హనుమంత్‌రావ్, వైస్‌ఎంపీపీ పడ్వాల్ గోపాల్‌సింగ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మసుద్, మాజీ వైస్‌ఎంపీపీ నర్వాట్ల విజయ్ కుమార్, మండల కోఆప్షన్ సభ్యుడు మిర్జా జిలానిబేగ్, ఎంపీటీసీలు కోవ రాజేశ్వర్, మడావి భీంరావ్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం, ఏమాయికుంటు సర్పంచ్ జాదవ్ లఖన్‌సింగ్, మాజీ ఎంపీటీసీ నర్వాట్లే బాలాజీ, ఏఎంసీ మాజీ చైర్మన్లు రాథోడ్ మోహన్, వసంత్ రావ్, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు తొడసం హరిదాస్, నాయకులు కోరెంగా సుంకట్‌రావ్, సర్కాళే శివాజీ, శ్రీనివాస్, జాదవ్ ప్రకాశ్, రాంనివాస్, ఆత్రం ధర్ము, కుమ్రరాంషావ్, ఇర్షాద్, శ్యామ్, నవాబ్‌బేగ్, రోహిదాస్, అశోక్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ మారుతిపటేల్ డోంగ్రే